ప్రధాని పర్యటన రద్దు



అడయార్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన రద్దయినట్లు తెలిసింది. ఈ నెల 26న ప్రధాని మోదీ తిరువణ్ణామలై, చిదంబరం ఆలయాలను దర్శిస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే, చిదంబరం నటరాజ ఆలయం నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు జరిగాయి. ఈ క్రమంలో, ప్రధాని విదేశీ పర్యటన, పార్లమెంటు సమావేశాల కారణంగా ఈ నెల 26న రాష్ట్ర పర్యటన రద్దయినట్లు తెలిసింది. అక్టోబరు మొదటి వారంలో ఆయన రాష్ట్రానికి వచ్చే అవకాశముంది. జూలైలో రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ, ఆధునికీకరించిన తూత్తుకుడి విమానాశ్రయాన్ని ప్రారంభించి, పలు పథకాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

రేపు నగరానికి రానున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి



చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం నగరానికి రానున్నారు. ఆ సందర్భంగా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి మద్దతు కోరనున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు సెప్టెంబర్ 9న జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న రాష్ట్రానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు సీపీ రాధాకృష్ణన్ పోటీ చేస్తున్నారు. ఇండియా కూటమి తరఫున జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీపడుతున్నారు. వీరిద్దరూ ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఎంపీల మద్దతు కోరుతున్నారు. ఆ ప్రకారమే ఆదివారం జస్టిస్ సుదర్శనరెడ్డి నగరానికి వచ్చి స్టాలిన్‌తో భేటీ కానున్నారు. ఆ సందర్భంగా డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే పార్టీల నేతలు కూడా సుదర్శనరెడ్డిని కలుసుకోన్నారు. డీఎంకే మిత్రపక్షాలు ఏర్పాటు చేయనున్న విందులో జస్టిస్ సుదర్శనరెడ్డి పాల్గొంటారని తెలుస్తోంది.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

● రోడ్డు ప్రమాదంలో మహిళ సహా ముగ్గురి మృతి

పెరంబూర్,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో వ్యాన్-లారీ ఢీకొన్న ఘటనలో మహిళ సహా ముగ్గురు మృతిచెందారు. సేలం జిల్లా వెంబడితాళం మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన కమలం (74), కుమారుడు సుకుమార్ (49), కోడలు సుశీల (45), అదే ప్రాంతానికి చెందిన మోహన్(54), ఆయన భార్య భువనేశ్వరి(49) గురువారం ఉదయం వ్యానులో భవాని కూడుదురైలోని స్వామి దర్శనానికి వెళ్లారు.వారు తిరిగి వస్తుండగా, కోవై-సేలం జాతీయ రహదారిలోని పచ్చాంపాళయం ప్రాంతంలో రోడ్డు పక్కగా నిలిపిన లారీని వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో కమలం, సుకుమార్, మోహన్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, సుశీల, భువనేశ్వరి తదితరులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెప్పడై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సంగగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

● రూ.124.97 కోట్లతో పలు నిర్మాణాలు ● ప్రారంభించిన సీఎం



దేవాదాయశాఖ నిర్మించిన భవనాలను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 12 సుప్రసిద్ధ ఆలయాల్లో రూ.124.97 కోట్లతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. చెన్నై సచివాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రూ.32.53 కోట్లతో వెయ్యేళ్లనాటి ప్రాచీన ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించారు. ఇదే విధంగా వివిధ ఆలయాల్లో రూ.51.19 కోట్లతో నిర్మించిన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. తిరువణ్ణామలై ఆలయం వద్ద రూ.68.29 కోట్లతో నిర్మించనున్న వసతిగృహం, వెయిటింగ్ హాలు, అరుణగిరి నాథాలయ సమీపంలో సభామందిరం, విరుదునగర్ జిల్లా నాచ్చియార్ తిరుకోవిల్‌లో రూ. 12.24 కోట్లతో ఆలయ రాజగోపురాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, వసతి గృహం, పార్కింగ్ నిర్మాణ పనులకు స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా రామేశ్వరం ఆలయంలో రూ.9.70 కోట్లతో రెండో ప్రాకారం పునర్నిర్మాణ పనులు, శ్రీరంగంలో రూ.8.75 కోట్లతో విద్యుత్‌దీపాల ఏర్పాటు, అదే విధంగా పలు ఆలయాల వద్ద అర్చకులు, సిబ్బందికి క్వార్టర్స్, భక్తుల కోసం వసతి గృహాలు, పలు ఆలయాలకు రాత్రిపూట మెరిసేలా విద్యుద్దీపాల పనులకు శంకుస్థాపనతో పాటు, రాష్ట్రంలోని 11 ఆలయాల్లో నిర్మించిన పరిపాలనా భవనాలు, పునర్నిర్మించిన కొలనులు తదితర నిర్మాణాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, అదనపు కమిషన్లు డాక్టర్ సి. పళని, పి.జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

10 గోదాముల ప్రారంభం...

వినియోగదారుల వాణిజ్య సంస్థ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూ.60.85 కోట్లతో నిర్మించిన 10 గోదాములను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు ఆర్ చక్రపాణి, సీవీ గణేశన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధ్యక్షుడు పి.రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.





అమిత్‌షా అభివాదం - సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొడదాం

● తిరునల్వేలి సభలో అమిత్‌షా శపథం

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో కూరుకుపోయిన డీఎంకే ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బూత్ కమిటీ నిర్వాహకులకు పిలుపునిచ్చారు. తిరునల్వేలిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన పార్టీ దక్షిణ మండలాల ఏడు వేల బూత్‌కమిటీ నిర్వాహకుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 18 శాతం ఓటు బ్యాంక్ సంపాదించుకుందని, అన్నాడీఎంకే 21 శాతం ఓటు బ్యాంక్ పొందిందని గుర్తు చేశారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఈ రెండు పార్టీలు 39 శాతానికి పైగా ఓట్లు పొంది విజయ సాధిస్తాయన్నారు. బూత్ కమిటీ నిర్వాహకులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్ళి ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలని, దాంతో పాటు రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వ అవినీతి అక్రమాల గురించి కూడా తెలియజెప్పాలని సూచించారు. పుణ్యభూమి తమిళనాట తమిళంలో మాట్లాడలేకపోతున్నందుకు క్షమాపణలు కోరుతున్నానని, సమరయోధుల సీమగా పేరొందిన తిరునల్వేలిలో ప్రసంగించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన జీవిత పర్యంతమూ బీజేపీ అభివృద్ధికే పాటుపడిన సీనియర్ నేత, నాగాలాండ్ మాజీ గవర్నర్ ఇల గణేశన్ మృతి తమకు తీవ్ర దుఃఖాన్ని కలిగించిందని, ఈ సభలో ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

తమిళులకే అగ్రతాంబూలం..

ప్రధాని నరేంద్రమోదీకి తమిళనాడు ప్రజలకు, తమిళ భాషకు, తమిళ భాషకు గట్టి మద్దతు ఇస్తుంటారని, అదే సమయంలో తమిళులకు కీలకమైన పదవులను అప్పగించడానికి కూడా ఏ మాత్రం వెనుకాడబోమన్నారు. తమిళుడైన ఏపీజే అబ్దుల్‌కలాంను అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టామని, తాజాగా తమిళుడైన సీపీ రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామని, ఉపరాష్ట్రపతి హోదాలో రాజ్యసభ నడిపించే అరుదైన గౌరవం ఆయనకు దక్కబోతుందన్నారు. తిరుక్కురళ్‌ను 13 భాషల్లో అనువదించిన ఘనత ప్రధాని మోదీకి మాత్రమే దక్కుతుందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రధాని, మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే పదవినుంచి తొలగించేందుకు వీలుకల్పించే బిల్లును ప్రవేశపెడితే ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయని, దీనికి కారణం ప్రతిపక్ష పార్టీల్లో అత్యధిక శాతం మంది అవినీతి పరులేనని తెలిపారు. ఈ బిల్లును తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నల్లచట్టంగా పేర్కొనటం విడ్డూరంగా ఉందని, ఈ రాష్ట్రానికి చెందిన మంత్రులు పొన్ముడి, సెంథిల్‌బాలాజీ అవినీతి కేసులో అరెస్టయి జైలు నుండే పాలన వ్యవహారాలు నడిపించడం న్యాయమేనా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సినీనటుడు శరత్‌కుమార్, మాజీ గవర్నర్ తమిళిసై, వానతి శ్రీనివాసన్, ఎమ్మెల్యే ఆర్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.రాజేంద్రన్ ● ఘనంగా వేణుగోపాల్ విద్యాలయ వార్షికోత్సవం



స్కూలు టాపర్లతో కె.అనీల్‌కుమార్ రెడ్డి, సి.రాజేంద్రన్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.రాజేంద్రన్ హితవు పలికారు. మందవెల్లిలో తెలుగు మహాజన సమాజం నిర్వహణలోని శ్రీ వేణుగోపాల్ విద్యాలయ మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ పాఠశాల 45వ వార్షికోత్సవం శుక్రవారం తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో ఘనంగా జరిగింది. పాఠశాల అధ్యక్షులు కె.అనీల్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్రన్, జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 1980లో 11 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లతో ఉన్నత లక్ష్యంతో ప్రారంభించిన వేణుగోపాల్ విద్యాలయం నేడు మహా వృక్షంగా ఎదిగి 40 మంది టీచర్లు, వెయ్యి మందికిపైగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోందని కొనియాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న పాఠశాల నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా, సభాధ్యక్షులు అనీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... విద్యతోనే జీవితంలో ముందుకు సాగుతారన్న సత్యాన్ని విద్యార్థి దశలోనే గ్రహించాలని హితవు పలికారు. పాఠశాల్లో చదువుకున్న విద్యార్థుల్లో పలువురు నేడు ఉన్నతవంతులుగా ఎదిగి, పది మంది ఉపాధికి దారిచూపుతున్నారని వెల్లడించారు. ప్రతి ఏడాదిలాగే అనీల్‌కుమార్ రెడ్డి ప్రత్యేకంగా మెరిటోరియల్ విద్యార్థులకు హ్యాండ్ వాచ్‌లు, మెడల్స్, నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథితో కలిసి ప్రదానం చేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు వి.షీల వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల ఉపాధ్యక్షులు కె.ఆనంద్‌కుమార్ రెడ్డి, కోశాధికారి కె.రంగా రెడ్డి, ఈసీ మెంబర్ వెంకట్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తెలుగు ప్రముఖులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

విజయ్‌పై విపక్షాల విసుర్లు

● అభిమానుల మెప్పు కోసమే ఆ మాటలు: మంత్రి నెహ్రూ

● తనను తాను అవతారమూర్తిగా ఆత్మవంచన ● అన్నాడీఎంకే నేత ఉదయకుమార్

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మదురై మహానాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలను విమర్శించడాన్ని ఖండిస్తూ ఆ పార్టీల నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. రాష్ట్ర పురపాలక, పరిపాలనా శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ... నలభై ఏళ్ల రాజకీయ అనుభవం, ముఖ్యమంత్రిగా రాష్ట్రప్రజలకు సేవలందిస్తున్న స్టాలిన్‌ను విజయ్ విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు విజయ్‌కి మొదటివని, అందువల్ల ఓట్ల కోసం వ్యూహ రచన చేయాలనే కానీ, ప్రజా సేవలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న నేతలను అభిమానుల మెప్పు కోసం విమర్శించడం సరి కాదన్నారు. విజయ్ మాటలను ప్రజల లెక్కచేయరన్నారు. మరో మంత్రి మూర్తి మాట్లాడుతూ... టీవీకే మహానాడుకు ఆటంకం కలిగించేలా ప్రభుత్వ కుట్ర పన్నిందన్న విజయ్ ఆరోపణలు అవాస్తవాలన్నారు. ఆ పార్టీ మొదటి మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో గత ఏడాది నిర్వహించేందుకు ప్రభుత్వం అన్నివిధాల సహకరించిన విషయాన్ని విజయ్ మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆత్మవంచన చేసుకుంటున్న విజయ్ : అన్నాడీఎంకే



సినీ హీరో విజయ్ తనను తాను అవతారమూర్తిగా భ్రమిస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నారని అన్నాడీఎంకే సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ఆర్బీ ఉదయకుమార్, డి.జయకుమార్ విమర్శించారు. రాజకీయ, సినీరంగాల్లో ఎంజీఆర్, జయలలిత ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వారిలా కావాలనుకోడం విజయ్ వల్ల సాధ్యం కాదన్నారు. బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందర్‌రాజన్ మాట్లాడుతూ.. టీవీకే మదురై మహానాడులో పాల్గొన్న వారంతా విజయ్‌ను ఒక రాజకీయ నేతగా చూడలేదని, ఆయన నటుడు కావడంతో ప్రత్యక్షంగా చూడాలని వెళ్లారని చమత్కరించారు. ప్రధాని నరేంద్ర మోదీ పనితీరును ప్రపంచ దేశాలన్నీ మెచ్చుకుంటున్నాయని, రాజకీయాల్లో అనుభవం లేని విజయ్‌కు ప్రధానిని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కచ్చాదీవి గురించి మాట్లాడుతున్న విజయ్.. అది ఎవరి హయాంలో శ్రీలంకకు ధారాదత్తం చేశారో మహానాడులో ప్రస్తావించలేదన్నారు. దీనిని బట్టి ఆయనకు రాజకీయాల్లో అనుభవం శూన్యమని స్పష్టమవుతుందన్నారు.

ఆరోగ్యశాఖలో 644 మంది నియామకం



చెన్నై రాజధాని కళాశాలలో ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 120మంది హెల్త్ అసిస్టెంట్లకు, 48 మంది దంతవైద్యులకు, 324 మంది ఆపరేషన్ థియేటర్ అసిస్టెంటుకల, ఇతర విభాగాల్లో నియమితులైన మొత్తం 644 మందికి సీఎం స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్.ప్రియ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

ఎడప్పాడే కాబోయే సీఎం

● డాక్టర్ సునీల్

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 200లకు పైగా నియోజకవర్గాల్లో ఘనవిజయం సాధించి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి అవుతారని అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. ప్రతి ఏటా తిరుమలకు కాలినడకన వెళ్లే 'ఉంగలుక్కాగ' సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సునీల్ ఈసారి ఈపీఎస్ నేతృత్వంలో వచ్చే ఏడాది రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావాలన్న కోరికతో శనివారం నగరం నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా సునీల్ మీడియాతో మాట్లాడుతూ... ఈపీఎస్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రచార యాత్రకు ప్రజా స్పందన పెరుగుతోందని, వచ్చే ఏడాది ఆయన తప్పకుండా సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.



తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న సునీల్

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

బీసెంట్ నగర్: ఎల్లియమ్మన్ ఆలయ వీధి, వన్నాన్ తురై, జయరామ్ అవెన్యూ, రామస్వామి అవెన్యూ, అప రంజి అవెన్యూ, ఎస్బీఐ కాలని.

అడయార్: శాస్త్రి నగర్ 1వ మెయిన్ రోడ్డు, 4 నుంచి 13 క్రాస్ వీధులు.

నేడు 'నలం కాక్కుమ్ స్టాలిన్' శిబిరం

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలం దూర్ మండలం ఏజీఎస్ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'నలం కాక్కుమ్ స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరం జరుగనుంది. జనరల్ చికిత్స సహా 17 విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే, ముఖ్యమంత్రి బీమా పథకంలో దివ్యాంగులకు గుర్తింపుకార్డుల అందజేత, అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ శాఖ సభ్యులకు గుర్తింపు కార్డులు తదితరాలు అందజేయనున్నట్లు, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం

నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' ప్రత్యేక శిబిరం 4వ మండలం వ్యాసర్పాడి ఎంకేబీ నగర్ మూడవ మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ స్కూలులో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగనుంది. ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు, ఎల్లుండి 'నేచురల్ బజార్'

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక బృందాలు తయారుచేసిన వస్తువులు 'నేచురల్ బజార్' ద్వారా విక్రయిస్తుంటారు. నుంగంబాక్కంలోని అన్నా థెరిస్సా మహిళా ప్రాంగణంలో ప్రతి నెలా మొదటి, మూడవ శని, ఆదివారాల్లో ఈ బజార్ నిర్వహిస్తుంటారు. ఈ ప్రకారం, శని, ఆదివారాల్లో నిర్వహించనున్న బజార్‌లో కూరగాయలు, ఆకు కూరలు, సహజ సిద్ధంగా తయారుచేసిన పొడులు, దుస్తులు రాయితీ ధరపై విక్రయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జ్యోతిర్లింగాల దర్శన ఆధ్యాత్మిక రైలు

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) జ్యోతిర్లింగాలు, షిర్డీ, శనిసింగనాపూర్, పండరీపురం, మంత్రాలయం తదితర క్షేత్రాల సందర్శనకు ఐఆర్‌సీటీసీ 'భారత్ గౌరవ్' పేరుతో ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు నడపనుంది. నవంబరు 9వ తేది తిరునల్వేలి నుంచి బయల్దేరే రైలు తెన్‌కాశి, రాజపాళయం, శివకాశి, విరుదునగర్, మదురై, దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెంగల్పట్టు, తాంబరం, చెన్నై ఎగ్మూర్, విజయవాడ మీదుగా వెళ్లనుంది. ఏసీ 2 టైర్, 3 టైర్, స్లీపర్ క్లాస్ ఛార్జీలు వరుసగా రూ.36,500, రూ.26,000, రూ.14,400గా నిర్ణయించారు. ఏడు రోజుల ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న వారు www.irctctourism.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

పారిశుధ్య కార్మికులకు వారాంతపు సెలవు

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వారంలో ఒకరోజు సెలవు ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సర్క్యులర్లు పంపారు. అంతకు మించి సెలవు తీసుకునే వారి నుంచి వేతనం నుంచి రూ.160 తగ్గించాలని సర్క్యులర్‌లో సూచించారు.

వేలాంకన్ని ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేలాంకన్ని ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తెలిపింది. నాగపట్టణం జిల్లాలోని వేలాంకన్ని మేరీ మాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 10వ తేది వరకు 1,050 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. చెన్నై, తూత్తుకుడి, కన్నియాకుమారి, తిరుచ్చి, తంజావూరు, చిదంబరం, దిండుగల్, మనప్పారై తదితర ప్రాంతాల నుంచి వేలాంకన్నికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎస్ఈటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 4,065 మంది ఎంపిక

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్రం నుంచి 4,065 మంది ఎంపికైనట్లు తమిళనాడు హజ్ కమిటీ తెలిపింది. 2026వ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్రం నుంచి 10,846 మంది దరఖాస్తు చేసుకోగా, లక్కీ డ్రిప్ ద్వారా 4,065 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 25వ తేదిలోపు రూ.1,52,300 ఆన్‌లైన్, ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్ ద్వారా భారత హజ్ కమిటీ ఖాతాకు పంపించాలి. నగలు చెల్లించిన రసీదు ఈ నెల 30వ తేదిలోగాసమర్పించాలని, మరిన్ని వివరాలకు తమిళనాడు రాష్ట్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

వ్యవసాయ కార్మికుల ప్రమాద బీమా పెంపు

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భూమి లేని వ్యవసాయ కార్మికుల ప్రమాద బీమా రూ.2 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు రూ. పరిహారం ఇస్తుండగా, రెండు రెట్లు పెంచినట్లయింది. అలాగే, ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన వారికిచ్చే ఆర్థికసాయం రూ.20వేల నుంచి రూ. లక్షకు, వ్యవసాయ కార్మికుల సహజ మరణానికి అందించే ఆర్థికసాయం రూ.20వేల నుంచి రూ.30వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

25, 26న షోళింగర్ రోప్ కార్ సేవల నిలిపివేత

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా షోళింగర్ లక్ష్మీనరసింహ ఆలయంలో రెండు రోజుల పాటు రోప్ కార్ సేవలు నిలిపివేయనున్నారు. రాణిపేట జిల్లా షోళింగర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లేందుకు 1,305 మెట్లు ఎక్కాల్సి ఉంది. భక్తుల సౌకర్యార్థం రోప్ కార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కొండకు వెళ్లేందుకు ఒకరికి రానుపోను రూ.100 చార్జీ వసూలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మరమ్మతుల కారణంగా ఈ నెల 25,26 తేదీల్లో రోప్ కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు, 27వ తేది నుంచి యధావిధిగా ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు మార్గదర్శకాలు



పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గణేశుడి విగ్రహాల ఏర్పాటుకు మార్గదర్శకాలు విడుదల చేశారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ అరుణ్, విగ్రహాల కమిటీ నిర్వాహకులతో గురువారం సమావేశమయ్యారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి సమావేశంలో రూపొందించిన మార్గదర్శకాలను పోలీసు శాఖ విడుదల చేసింది.

ఆ ప్రకారం...

- విగ్రహం ఏర్పాటుచేసే ప్రాంతంలో స్థల యజమాని, రహదారులు, ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి పొందాలి. అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖల నుంచి ఎన్‌వోసీ పొందాలి.
- విగ్రహాలు పదడుగులకు మించి ఉండకూడదు.
- ఇతర ప్రార్థనా స్థలాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల సమీపంలో విగ్రహాలు ఏర్పాటు చేయరాదు.
- విగ్రహాల భద్రత దృష్ట్యా ఇద్దరు ప్రతినిధులను 24 గంటలు షిఫ్టు పద్ధతిలో నియమించాలి.
- విగ్రహాలను పోలీసు శాఖ సూచించిన రోజులు, అనుమతించిన మార్గంలో శాంతియుతంగా తీసుకెళ్లి నిమజ్జనం చేయాలి.
- విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రదేశాలు, ఊరేగింపు మార్గాలు, సముద్ర తీరాల్లో బాణసంచా నిషేధం. విగ్రహ కమిటీలు ఈ మార్గదర్శకాలు పాటించి వినాయక చవితి పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

కొళత్తూర్‌లో మెట్రో సొరంగం పనులు పూర్తి

● విజయవంతంగా బయటకు వచ్చిన 'కురింజి'



యంత్రానికి స్వాగతం పలుకుతున్న సీఎంఆర్ఎల్ అధికారులు, సిబ్బంది

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం-షోలింగనల్లూర్ మెట్రో మార్గంలో, కొళత్తూర్ స్పిల్‌వే నుంచి కొళత్తూర్ స్టేషన్ వరకు 246 మీటర్ల సొరంగం తవ్వకాలు ముగించుకుని యంత్రం 'కురింజి' విజయవంతంగా బయటకు వచ్చింది. నగరంలో రెండో మెట్రో ప్రాజెక్టులో మూడు మార్గాల్లో 116 కి.మీ మేర మెట్రో పనులు జరుగుతున్నాయి. ఈ మార్గాల్లో మాధవరం నుంచి షోలింగనల్లూర్ వరకు 44.6 కి.మీ. మెట్రో నిర్మాణపనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. మాధవరం పాల డిపో నుంచి ప్రారంభమై కోయంబేడు, పోరూర్, ఆలందూర్ మీదుగా షోలింగనల్లూర్ వరకు ఈ మార్గం కొనసాగుతోంది. ఈ మార్గంలో 5.8 కి.మీ దూరం సొరంగం మార్గం ఏర్పాటవుతోంది. అందుకోసం కురింజి, ముల్లై, మరుదం, నెయిదల్ అనే పేరుతో నాలుగు సొరంగం తవ్వే యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ మార్గంలో పనులు చేపట్టిన 'కురింజి' యంత్రం 246 మీటర్ల సొరంగం తవ్వే పనులు విజయవంతంగా పూర్తిచేసి గురువారం కొళత్తూర్ స్టేషన్ వద్ద వెలుపలికి వచ్చిందని సీఎంఆర్ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునన్ తెలిపారు.

పంచాయతీ సెక్రటరీని బంధించిన గ్రామస్తులు



పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీని గ్రామస్తులు గదిలో బంధించిన ఘటన కడలూరు జిల్లాలో చోటు చేసుకుంది. జ.ఎంతల్ గ్రామ ప్రజలు అధికంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో, పంచాయతి సెక్రటరీ వేల్‌మురుగన్, ఇంటి పన్ను, తాగునీటి పన్ను చెల్లించిన రసీదు చూపించే వారికే ఉపాధి హామీ పనులకు అనుమతిస్తామని గ్రామస్తులకు తెలిపినట్లు సమాచారం. దీంతో ఖంగుతిన్న గ్రామస్తులు, గురువారం పంచాయతి కార్యాలయానికి వెళ్లి, అందరికి ఉపాధి పనులు చేపట్టేందుకు అవకాశం ఇవ్వాలని సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు. ఒకానొక సమయంలో ఆగ్రహించిన గ్రామస్తులు, సెక్రటరీని కార్యాలయంలో బంధించి తలుపులకు తాళం వేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని, గ్రామస్తులను శాంతపరిచి సెక్రటరీ వేల్‌మురుగన్‌ను విడిపించారు.

● ట్రాఫిక్ రద్దీ..

ఆలస్యంగా బయల్దేరిన విమానాలు





పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం, క్రోంపేట ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ కారణంగా నగరం నుంచి పది విమానాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లాయి. పల్లావరం ఫ్లై ఓవర్‌పై శుక్రవారం ఉదయం ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డివైడర్‌ను ఢీకొంది. ఈ కారణంగా ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో, ట్రాఫిక్ పోలీసులు రంగంలో దిగి, ఫ్లై ఓవర్‌ను తాత్కాలికంగా ఒన్‌వేగా మార్చి, పల్లావరం నుంచి విమానాశ్రయం వెళ్లే వాహనాలకు అనుమతించారు. మరో మార్గంలో తాంబరం వైపు వెళ్లే వాహనాలను ఫ్లై ఓవర్ కింద ఉన్న రోడ్డు గుండా పంపించారు. విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పలువురు విమాన ప్రయాణికులు సకాలంలో విమానాశ్రయానికి చేరుకోలేకపోయారు. ఈ కారణంగా ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు కౌలాలంపూర్, మస్కట్, కొలంబో సహా 10 విమానాలు అరగంట ఆలస్యంగా బయల్దేరి వెళ్లాయి. కాగా, బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి పోలీసులు, అతనిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

వైభవంగా మణి ద్వీప వర్ణన పూజ



మణి దీప వర్ణన పూజ నిర్వహిస్తున్న హరికుమార్-కిరణ్‌కుమారి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా లలిత మణిద్వీప వర్ణన పూజలను నగరంలో వైభవంగా నిర్వహించారు. షావుకారుపేటలోని వాసవి మినీ హాలులో వాసవి బిల్డర్స్ అండ్ ప్రమోటర్స్ అధినేత హరికుమార్-కిరణ్‌కుమారి దంపతుల పర్యవేక్షణలో వేదికపై లలిత అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చారు. తొమ్మిది రకాల పూలు, పత్రాలు, పండ్లు, నవధాన్యాలు నైవేద్యంగా సమర్పించారు. తొమ్మిది మంది ముత్తయిదువులు కూర్చుని 9 సార్లు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పూజల్లో పాల్గొన్న ముత్తయిదువులకు పాద పూజ చేసి పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. డీఎంకే ప్రముఖులు, మాజీ కౌన్సిలర్ ఎస్.మురళి, కేఆర్ అపరంజి, వావిచెర్ల సత్యనారాయణ, బాలమురుగన్, డా.ప్రత్యూష సహా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు



రైతు సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రైతుల గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి అశోక్‌కుమార్, డీఆర్వో మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ కాంచన, వేలూరు కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయకుమార్, వేలూరు జిల్లా కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ జాయింట్ డైరెక్టర్ రాందాస్, రైతులు పాల్గొన్నారు.

పుదువైలో కలైంజర్ అరివాలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న డీఎంకే నేతలు

పుదుచ్చేరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి ఈసీఆర్ రోడ్డులో 'కలైంజర్ అరివాలయం' నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పుదుచ్చేరి ఈసీఆర్ రోడ్డులో శివాజీ గణేశన్ విగ్రహం సమీపంలో డీఎంకేకు చెందిన 3,000 చ.అ స్థలంలో కలైంజర్ అరివాలయం నిర్మించేందుకు అనుమతించారు. శుక్రవారం ఉదయం పుదుచ్చేరి డీఎంకే ఆర్గనైజర్, ప్రతిపక్ష నేత శివ నేతృత్వంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆ పార్టీ ప్రిసీడియం చైర్మెన్ శివకుమార్, ఎమ్మెల్యేలు అనిపాల్ కెనడీ, సెందిల్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల హేళనగా మాట్లాడడం సరికాదు

● నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముక్కుపుడక, చెవిదిద్దులు ధరిస్తే గృహిణుల పథకం కింద రూ.1,000 ఇవ్వమని డీఎంకే మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ మహిళల గురించి హేళనగా మాట్లాడడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... పథకాలు ఇస్తున్నామన్న పేరుతో మంత్రులు, నాయకులు మహిళలను చిన్నచూపు చూస్తున్నారని, భవిష్యత్తులో ఇలాంటి విమర్శలు రాకుండా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ నేతలను కట్టడి చేయాలని నయినార్ డిమాండ్ చేశారు.

పనిభారం తగ్గించాలంటూ అంగన్‌వాడీల ధర్నా



తిరుత్తణి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తిరుత్తణి,పళ్లిపట్టు, ఆర్కే పేట, తిరువలంగాడు మండల కేంద్రాల్లోని చిన్నపిల్లల సంరక్షణ కేంద్రాల వద్ద చేపట్టిన ధర్నాలో ఉద్యోగులు మాట్లాడుతూ... ప్రీ స్కూల్ విద్య అందిస్తున్న అంగన్‌వాడీలకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇచ్చే పనులు కూడా అప్పగిస్తున్నారని, వారికి అందించే సమయంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇప్పటికే విధి నిర్వహణలో ఉన్న తమకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు, ఇతర విధుల నుంచి తమను మినహాయించాలని వారు డిమాండ్ చేశారు.

1 నుంచి డచ్చెస్ ఉత్సవ్ 2025



మీడియా సమావేశంలో ప్రముఖులు

అడయార్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1, 2వ తేదీల్లో 'డచ్చెస్ ఫెస్టివల్ 2025' జరుగనుంది. తాజాగా నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డచ్చెస్ క్లబ్ బృందం పీనా రెడ్డి, సుజాత, అను అగర్వాల్, రతి, అనుచ సచ్‌దేవ్ వెల్లడించారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ మైలాపూరులోని సవేరా హోటల్‌లో ఫ్యాషన్ షోకేస్ ప్రదర్శన ఇటీవల విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు అలాగే, వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో డచ్చెస్ ఫెస్టివల్ పేరుతో ఒక సంప్రదాయ, స్టైలిష్ ఫ్యాషన్ షో ద్వారా ఎంపిక చేసిన ఉత్పత్తుల ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇందులో ప్రముఖ డిజైనర్లు తయారుచేసి బ్రాండ్లను ప్రదర్శనకు ఉంచుతామన్నారు. క్రియేటివిటీ, క్రాఫ్ట్‌మెన్‌షిప్, ట్రెండ్స్ ఇలా ఒక ఆకర్షణీయమైన సంగ్రహావలోకనం కలిగివుంటుందని తెలిపారు.

బడికి వెళ్లాలంటే చెత్తబండే ఆసరా !



ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భవాని నదిలో వరద ఉధృతంగా పెరిగిన కారణంగా దోనెల సవారీ నిషేధించడంతో బడి పిల్లలను చెత్త బండిలో స్కూలు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈరోడ్ జిల్లా గోపి సమీపంలో ఉన్న అమ్మాపాళయం గ్రామంలో 500లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంత వాసులు ఉద్యోగాలకు, పొరుగు ప్రాంతాలకు వెళ్లేందుకు దోనెల ద్వారా నది దాటుతుంటారు. 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దోనెల ద్వారా భవాని నది దాటి అటువైపు కి.మీ దూరంలో ఉన్న అత్తాని ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు వెళ్లి చదువుతున్నారు. ఈ నేపథ్యంలో, భవాని నదిలో వరద అధికంగా ఉన్న సమయాల్లో అమ్మాపాళయం నుంచి సుమారు 7 కి.మీ దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. అందువల్ల ద్విచక్ర వాహనం లేని విద్యార్థులను మూడు రోజులుగా ఆ ప్రాంతంలో చెత్త సేకరించే వాహనాల్లో పాఠశాలకు తరలిస్తున్నారు. అందువల్ల విద్యార్థుల సౌకర్యార్థం వాహన సదుపాయం కల్పించాలని తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మియాట్‌లో అరుదైన శస్త్రచికిత్స

● కాంప్లెక్స్ ట్రాన్సోరల్ రోబోటిక్ సర్జరీతో నోటిలో కణితి తొలగింపు



శాంతకుమారిని అభినందిస్తున్న మల్లికా మోహన్‌దాస్, డాక్టర్ అరుణ్ మిత్ర

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మియాట్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఓ మహిళ నోటిలో టెన్నిస్ బాల్ పరిమాణంలో వున్న కణితిని 'కాంప్లెక్స్ ట్రాన్సోరల్ రోబోటిక్ సర్జరీ' ద్వారా విజయవంతంగా తొలగించారు. ఈ వివరాలను మియాట్ ఆస్పత్రి హెడ్ అండ్ నెక్ ఆంకో సర్జన్ డాక్టర్ అరుణ్ మిత్ర, ఆస్పత్రి చైర్మన్ మల్లికా మోహన్‌దాస్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. వేలూరుకు చెందిన 64 ఏళ్ల శాంతకుమారికి నోటిలో పెద్ద పరిమాణంలో కణితి ఏర్పడింది. ఆమె పలు ఆస్పత్రుల్లో చూపించగా, అది క్యాన్సర్ కణితి అయివుండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అంతేగాక వెంటనే శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సిన అవసరముందన్నారు. దీంతో ఆమె మియాట్ ఆసుపత్రిని సంప్రదించారు. అది క్యాన్సర్ కణితి కాదని తేల్చిన డాక్టర్ అరుణ్ నేతృత్వంలోని వైద్యబృందం.. శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించింది. అయితే సంప్రదాయ ఓపెన్ సర్జరీ చేయాల్సి వస్తే దిగువ దవడ ఎముక విభజించాల్సివుంటుంది. దీని వలన రోగి ముఖంలో మచ్చ ఏర్పడుతుంది. అంతేకాకుండా కోలుకునేందుకు చాలాకాలం పట్టడంతో పాటు చికిత్సానంతరం పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. దీంతో అధునాతన చికిత్సా విధానమైన ట్రాన్సోరల్ రోబోటిక్ సర్జరీ చేయాలని వైద్యబృందం నిర్ణయించింది. ఆ మేరకు రోబోటిక్ సర్జరీతో కణితి తొలగించారు. జూలై 23న ఈ చికిత్స నిర్వహించగా, మూడో రోజే ఆమె కోలుకున్నారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడుపుతున్నారు.

నటి కుట్టి పద్మినికి జీవిత సాఫల్య పురస్కారం




కుట్టి పద్మినికి పురస్కారం ప్రదానం చేస్తున్న సదస్సు నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హిందీ సాహిత్య అకాడమీ, కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ) సంయుక్తంగా శుక్రవారం ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించాయి. జార్జి టౌన్‌లోని ఎస్‌కేపీసీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ హిందీ పండితులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన మొదటి సెషన్‌కు ముఖ్యఅతిథిగా చంద్రప్రకాష్ గోయెంకా హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా జయశంకర్ బాబూజీ, ప్రకాష్ జైన్, మహేష్‌కుమార్ శర్మ, ప్రొఫెసర్ నిర్మల మౌర్య పాల్గొన్నారు. సమావేశంలో సీనియర్ నటి కుట్టి పద్మినితో పాటు హిందీ భాషకు విశేష కృషిచేసిన పలువురు ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఇక, రెండో సెషన్‌లో సాహిత్యం, సైన్స్, అనుబంధ రంగాల సహా వివిధ అంశాలపై పలువురు ప్రసంగించారు. చెన్నై, ఇతర ప్రాంతాల నుండి ప్రముఖ కవులు ప్రత్యేక కవితా పఠనం చేశారు. వివిధ కళాశాల విద్యార్థులు తమ కవితా పఠనంతో ప్రశంసలు అందుకున్నారు. సదస్సు ఏర్పాట్లను ఎస్‌కేపీడీ ట్రస్టీలు, ఎస్‌కేపీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.పీబీ వనిత పర్యవేక్షించారు.

చెంబరంబాక్కం నుంచి జలాలు

● నగరవాసులకు రెండింతల తాగునీటి సరఫరా



జలాశయం వద్ద నీటి శుద్ధీకరణ ప్లాంట్

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోవాటర్ బోర్డు రెండింతలుగా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు చెంబరంబాక్కం జలాశయం వద్దనున్న నీటి శుద్ధీకరణ ప్లాంట్ నుంచి అదనపు జలాలను తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. చెంబరంబాక్కం ప్లాంట్ నుంచి కోయంబేడు వరకు నీటిని సరఫరా చేయనున్నారు. దీనికోసం భారీ పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.66.78 కోట్ల మేర నిధులను కూడా వెచ్చించింది. ప్రస్తుతం పైప్‌లైన్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గత రెండు రోజులుగా చెంబరంబాక్కం నుండి కోయంబేడు దాకా ఉన్న పైప్‌లైన్ల ద్వారా నీటిని జలాలను విడుదల చేసి అధికారులు పరిశీలించారు. పైప్‌లైన్లు నీటి ఒత్తిడిని తట్టుకోగలవని అధికారులు నిర్ధారించారు. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఆ పైప్‌లైన్ల ద్వారా నగరానికి నీటిని సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం నగరవాసులకు రోజూ 265 మిలియన్ లీటర్ల తాగునీటిని అందిస్తున్నామని, చెంబరంబాక్కం శుద్ధీకరణ ప్లాంట్ జలాలు సరఫరా అయితే ఈ నీటి పరిమాణం 530 మిలియన్ల లీటర్లకు పెరుగుతుందని చెప్పారు.

పుస్తకాల మధ్య కత్తితో పాఠశాలకు...

పెరంబూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా దిశయన్‌విలై ఎయిడెడ్ మహోన్నత పాఠశాలకు గురువారం ఉదయం 9వ తరగతి విద్యార్థి తన బ్యాగులో పుస్తకాల మధ్య కత్తితో వచ్చాడు. ఈ విషయం గుర్తించిన ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడికి తెలియజేయడంతో ఆయన దిశయన్‌విలై పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు పాఠశాలకు వెళ్లి సదరు విద్యార్థి నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... అదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థి తనకు కత్తి చూపించి బెదిరించినట్లు, ఆ విద్యార్థి తనను ఏదైనా చేస్తాడనే భయంతో ముందస్తు జాగ్రత్తగా బ్యాగులో కత్తి తీసుకొచ్చినట్లు విద్యార్థి పోలీసులకు తెలిపాడు. దీంతో, పాఠశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీసులు నిర్ణయించారు.







మౌంట్‌రోడ్డులోని సఫైర్ థియేటర్ కాంప్లెక్స్ - కాంతి థియేటర్

వినోదాన్ని పంచి... విషాదంలో ముంచి..



కూల్చివేస్తున్న అగస్త్యా 70ఎంఎం థియేటర్

● ముగిసిన సినిమా థియేటర్ల కథ

టి.నగర్, ఆంధ్రజ్యోతి

సామాన్యుడి నుంచి ధనవంతుడి వరకు తారతమ్యాలు లేకుండా వినోదం పంచేవి సినిమా థియేటర్లే. దక్షిణ భారత చలనచిత్రపరిశ్రమకు పుట్టిల్లు మద్రాసు నగరమే. నాగిరెడ్డి, మెయప్పశెట్టియార్, భానుమతి నిర్మించిన స్టూడియోలు అన్ని భాషలకు సంబంధించిన సినిమాల షూటింగ్‌లతో కళకళలాడుతుండేవి. సినీకళామతల్లి ఎన్నో వేలమంది కళాకారులను పెంచిపోషించిన ఆ కాలం ఓ స్వర్ణయుగం. స్టూడియోల్లో రూపొందిన సినిమాలన్నీ థియేటర్లలోనే రిలీజ్ అయి ప్రేక్షకులకు కావలసినంత వినోదాన్ని పంచిపెట్టేవి. నగరంలోని జెమినీ ఫ్లైఓవర్ (అన్నా ఫ్లైఓవర్) నుండి అన్నాదురై విగ్రహం కూడలి వరకు నడచి వెళుతుంటే ఇరువైపులా సినిమా థియేటర్లు, వాటి వద్ముందున్న వాల్ పోస్టర్లు కళకళలాడుతూ కనిపించేవి. సఫైర్, బ్లూడైమండ్, ఎమరాల్డ్, ఆనంద్, లిటిల్ ఆనంద్, అలంకార్, వెలింగ్టన్, దేవీ ప్యారడైజ్, శాంతి, చిత్రా, గెయిటీ, కాసినో, పారగన్ సినిమా థియేటర్లలో తమిళం, ఆంగ్లం, హిందీ, తెలుగు సినిమాలను ప్రేక్షకులు బాగా ఆదరించడంతో రిలీజైన ఒక్కో సినిమా కనీసం రెండు వారాల నుండి రెండు వందల రోజుల వరకు విజయవంతంగా ప్రదర్శించబడేవి. ఇప్పటిలా విజయవంతమైన రెండోరోజు, మూడోరోజు అనే పోస్టర్లు అప్పట్లో ముద్రించేవారు కారు. రమ్యమైన రెండో వారం, ముచ్చటైన మూడో వారం, అర్ధశతదినోత్సవం, శతదినోత్సవం, ద్విశతదినోత్సవం అంటూ అప్పటి సినిమాలన్నీ ప్రేక్షకులకు వినోదాన్ని అందించాయి. కామధేను, కృష్ణవేణి, చిత్రా, గెయిటీ, కాసినో, ప్లాజా, పైలెట్, అలంకార్, మినర్వా, శ్రీకృష్ణా, సెలక్ట్, క్రౌన్, భువనేశ్వరి, భారత్, ప్రభాత్, బ్రాడ్వే, ఎలిగంట్, నటరాజ్, పద్మనాభా, వెలింగ్టన్, మహాలక్ష్మి, సరస్వతి, మురుగన్ టాకీస్, రాక్సీ వీనస్, సయానీ, మేగలా, ఉమా, రాక్సీ శరవణా, బాలాజీ, లక్ష్మీ, అలంకార్, సఫైర్, ఆనంద్ థియేటర్లలో ఏ షోకు వెళ్ళినా కిటకిటలాడుతుండేవి. ఎంజీఆర్, శివాజీ, జయశంకర్, రవిచంద్రన్, కమల్‌హాసన్, రజినీకాంత్ నటించిన సినిమాలు వరుసగా రిలీజ్ అవుతున్నంత వరకు ఈ థియేటర్లలో పండుగ వాతావరణమే. వీటిలో మేఘల, శరవణా, చిత్రా, వెలింగ్టన్, బ్రాడ్వే థియేటర్లలో ఎంజీఆర్ నటించి సినిమాలు విడుదలయ్యేవి. శాంతి, క్రౌన్, భువనేశ్వరి థియేటర్లలో శివాజీ నటించిన కుటుంబపరమైన, పౌరాణిక సినిమాలు విడుదలయ్యేవి. ప్రస్తుతం ఆ థియేటర్ల జాడ గుర్తించడం చాలా కష్టం. వాటిలో ముప్పావు శాతం థియేటర్లు షాపింగ్‌మాల్స్‌గా, రెసిడెన్షియల్ ప్లాట్లుగా మారిపోయాయి. ఒట్టేరి ప్రాంతం చుట్టూ ఉండే సరస్వతి, మహాలక్ష్మి, భువనేశ్వరి, వసంతి, రాక్సీ, మేగలా, ఉమా థియేటర్లు అదృశ్యమయ్యాయి. అయనవరంలోని సయానీ థియేటర్ పలు అంతస్థుల భవనంగా మారింది. పురుషవాక్కంలోని రాక్సీ థియేటర్ ప్రాంతం శరవణా స్టోర్స్‌గా మారింది. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన సినిమాలు ఈ థియేటర్‌లోనే విడుదలయ్యేవి. మహేంద్రన్ దర్శకత్వం వహించిన ముల్లుమ్‌మలరుమ్, ఉదిరిపూక్కల్ వంటి సినిమాలు, టి.రాజేందర్, భాగ్యరాజ్ దర్శకత్వం వహించిన సినిమాలు రాక్సీలో ఎక్కువరోజులు ఆడేవి. మౌంట్‌రోడ్డు పొడవునా పదిహేను వరకు ఉండే సినిమా థియేటర్లలో ప్రస్తుతం దేవీ కాంప్లెక్స్, కాసినో థియేటర్ మాత్రమే మిగిలాయి.


సఫైర్ కాంప్లెక్స్‌లో వెరైటీ సిస్టమ్...

జెమినీ బ్రిడ్జిని ఆనుకుని థౌజెండ్ లైట్స్ పెద్దమసీదుకు ఎదురుగా భారతదేశంలోని మొట్టమొదటి మల్టీప్లెక్స్ థియేటర్ కాంప్లెక్స్- సఫైర్, బ్లూడైమెండ్, ఎమరాల్డ్ పేరుతో ముచ్చటగా మూడు థియేటర్లు 1964 నుండి 1994 వరకు ప్రేక్షకులకు వినోదాన్ని అందించాయి. ఈ కాంప్లెక్స్‌లోని బ్లూడైమండ్ థియేటర్లో ఓ వింత పద్ధతి అమలులో ఉండేది. ఆ థియేటర్‌లో ప్రదర్శించే సినిమా ఏ సమయంలోనైనా వెళ్ళి టికెట్ కొనుక్కుని కూర్చుని ఎంతసేపటివరకైనా చూడవచ్చు. మార్నింగ్‌షో ముగిసినా మ్యాట్నీ ముగిసినా, ఈవెనింగ్, నైట్‌షోలు ముగిసేంతవరకూ ఒకే సినిమా ఒకే టికెట్‌తో చూడొచ్చు. చాలా మంది తమకిష్టమొచ్చిన సమయంలో ఈ థియేటర్ నుండి బయటికొచ్చేవారు. మరికొంతమంది మార్నింగ్ షో నుంచి నైట్‌షో వరకు థియేటర్‌లోనే గడిపేవారు. ఇక ఉత్తర చెన్నైలో మింట్ ప్రాంతం నుండి తిరువొత్తియూరు దాకా 15 సినిమా థియేటర్లు ఉండేవి. శ్రీకృష్ణా, క్రౌన్ - ఈ రెండు థియేటర్లు మింట్ బస్టాండుకు దగ్గర్లో ఉండేవి. వీటికి కాసింత దూరంలో మురుగన్ థియేటర్- ఈ థియేటర్‌లో త్యాగరాజ భాగవతార్ నటించిన సినిమాలన్నీ ప్రదర్శించారు. ఈ మూడు థియేటర్ల ఆనవాళ్లు కూడా లేవు. వాటి స్థానంలో కొత్త కాంప్లెక్స్‌లు, షాపులు పుట్టుకొచ్చాయి. పాండ్యన్, అగస్త్యా, తమిళనాడు, పద్మనాభ థియేటర్లు అదృశ్యమయ్యాయి. ఈ థియేటర్లన్నింటికంటే ముందుగా నిర్మించిన ఎలక్ట్రిక్ థియేటర్ మౌంట్ రోడ్డు మెయిన్ పోస్టాఫీసు వద్ద ఉండేది. ప్రస్తుతం అక్కడ థియేటర్ ఉండేదని భావితరాలకు తెలియజేసేలా ఓ కౌంటర్ మాత్రమే కనిపిస్తుంది.

హ్యాపీ బర్త్‌డే 'మద్రాస్'.. మహానగరానికి 386 ఏళ్లు

ఎంజీఆర్ పెంచిన 'అడిమైపెణ్' సింహం

టి.నగర్, ఆంధ్రజ్యోతి



ఎంజీఆర్ పెంచిన సింహం 'రాజా'

విప్లవనాయకుడు ఎంజీఆర్ ఓ సింహాన్ని కన్న బిడ్డలా పెంచారు. కొన్నేళ్ల తర్వాత ఆ సింహాన్ని సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వెనుకవైపు మైలేడీస్ పార్కు సమీపంలోని జంతు ప్రదర్శనశాలకు దానంగా ఇచ్చారు. ప్రస్తుతం వండలూరులో ఉన్న జంతు ప్రదర్శనశాల కంటే ఎన్నో రెట్లు చిన్నది ఈ జూ.. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఈ జంతు ప్రదర్శనశాలను నిర్వహిస్తుండేది. ఈ జంతు ప్రదర్శనశాల కంటే ముందు మరొక జంతు ప్రదర్శనశాల మద్రాసు నగరంలో ఉండేది. ఎడ్వర్డ్ గ్రీన్ బాల్‌ఫోర్ మద్రాసు మ్యూజియం అధికారిగా ఉన్నప్పుడు సింహం, పులి, ఎలుగుబంటి, జింకలు, చింపాంజీలు, అడవిదున్నలు, ఏనుగులు వంటి అడవి జంతువుల కళేబరాల్లో అవయవాలు తొలగించి రసాయనాలు ఉపయోగించి వాటి సజీవరూపాలతో ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. ప్రాణమున్న అడవి జంతువులు, ప్రాణం లేని జంతువుల రూపాలుతో పక్కపక్కనే రెండు జంతు ప్రదర్శనశాలల ఏర్పాటుకు ఆయనే కారణమయ్యారు. 300లకు పైగా ప్రాణమున్న సింహం, పులి, ఎలుగుబంటి, జింకలు, అడవి దున్నలు, ఏనుగులు నలువైపులా కమ్మీలున్న షెడ్లలో ఉండేవి. అదే విధంగా ప్రాణంలేని జంతువుల సజీవ రూపాలు కూడా సందర్శకులను ఆకట్టుకునేవి. జీవంతో ఉన్న జంతు ప్రదర్శనశాలను అప్పట్లో 'బ్రతికిన కాలేజీ' అని, ప్రాణంలేని జంతువుల రూపాల ప్రదర్శనశాలను 'చచ్చిన కాలేజీ' అని పిలిచేవారు. ఈ జంతు ప్రదర్శనలను కాలేజీగా పిలవటానికి కారణం లేకపోలేదు. ఈ రెండు ప్రదర్శనశాలల్లో ఓ గైడు ఓ చేతిలో పుస్తకం, ఇంకో చేతిలో బెత్తం పట్టుకుని జంతువుల వివరాలను సందర్శకులకు చెబుతుండేవాడు. ఈ కారణంగా వీటిని 'బతికిన కాలేజీ' అని 'చచ్చిన కాలేజీ' అని పిలిచేవారు. చచ్చిన కాలేజీ రూపశిల్పి ఎడ్వర్డ్ గ్రీన్ బాల్‌ఫోర్. ఆయన జ్ఞాపకార్థం చెట్‌పట్‌లో బాల్‌ఫోర్ రోడ్డు కూడా ఉంది. ఆయన అక్కడే నివసించారు. 1854లో నిర్మించిన ఈ జంతు ప్రదర్శనశాలను పదేళ్ల తర్వాత రిప్పన్ బిల్డింగ్ వెనుకవైనునున్న పీపుల్స్ పార్కుకు తరలించారు. చచ్చిన కాలేజీలో స్థలాభావం వల్ల ఈ బ్రతికిన కాలేజీ 116 ఎకరాల విస్తీర్ణంలో నగరవాసులకు వింత అనుభూతి కలిగించింది. 1963 నుండి 1984 వరకు జంతు ప్రదర్శనశాల అక్కడే ఉండేది. పీపుల్స్ పార్కులోని జంతు ప్రదర్శనశాలలో ఎంజీఆర్ పెంచిన సింహాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించేవారు. ఆ సింహం పేరు 'రాజా'. సందర్శకులు 'రాజా' అని పిలిస్తే చాలు ఆ మృగరాజు గర్జిస్తూ దర్శనమిచ్చేది. 'అడిమైపెణ్' సినిమాలో ఎంజీఆర్‌తో ఫైట్ చేసిన సీన్‌లో ఈ సింహమే నటించింది. ఎంజీఆర్ నివాసంలో ఈ సింహం రాజభోగాలను అనుభవించింది. 1980 దశకంలో ఓ రోజు ఎంజీఆర్ జూకు వెళ్ళి ఈ సింహాన్ని పరామర్శించి వెళ్ళారు. కొద్ది రోజుల తర్వాత ఎంజీఆర్ పెంచిన సింహం మృతి చెందింది. చెడిపోకుండా రసాయన ద్రవాలతో పదిలపరచిన సింహం రూపం టి.నగర్‌లో ఎంజీఆర్ స్మారక మందిరంలో చూపరులను ఆకట్టుకుంటోంది. ఎంజీఆర్ పెంచిన సింహం ఉన్న ఆ బ్రతికిన కాలేజీ (జంతు ప్రదర్శనశాల) ఎలా ఉండేదో చూడాలనుకుంటున్నారా? అయితే యూట్యూబ్ ఆన్ చేసి 'కాక్కుమ్ కరంగళ్' తమిళ సినిమాలోని 'అల్లితండు కాలెడుత్తు' అనే పాట చూడండి. ఆ సాంగ్ మొత్తం ఆ జూలోనే చిత్రీకరించారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ విస్తరణ, సబర్బన్ రైల్వేస్టేషన్ నిర్మాణం కారణంగా ఆ జూ నగరానికి దూరంగా వండలూరుకు తరలిపోయింది. ఆ సమయంలోనే సబర్బన్ రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో మూర్ మార్కెట్ పూర్తిగా దగ్ధమైంది.



ఆనాటి 'బతికిన కాలేజీ'

రాష్ట్రం విడిపోయి ఏడు దశాబ్దాలు దాటినా..

తెలుగుపై తగ్గని ఆదరణ









టి.నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకుని ఏడు దశాబ్దాలు దాటినా ఇక్కడి ప్రజలకు తెలుగువారిపైనా, తెలుగు భాషపైనా ఆదరణ ఎంతోకొంత ఉండడంలో సందేహం లేదు. తమిళులు ఇప్పటికీ తెలుగువారిని తోబుట్టువుల్లానే భావిస్తున్నారు. ఇక ఈ రాష్ట్రంలోని ఆలయాలకు ఆంధ్రా, తెలంగాణా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. అదేవిధంగా తిరుమల వెంకన్నను దర్శించని తమిళులెవరూ ఉండరు. తమిళ రాజకీయ నాయకులు కూడా తమ పూర్వీకులు తెలుగువారే కావడంతో తెలుగువారిని ఆదరిస్తూనే ఉన్నారు. ఆంగ్లేయుల కాలం నుండి ఇప్పటివరకూ మద్రాసు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినవారిలో తెలుగువారే అధికమని చెప్పటం అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో 40 శాతానికి పైగా తెలుగువారున్నారు అందుకే రాజధాని నగరంలోని దుకాణాల నేమ్‌బోర్డుల్లో కొన్నిచోట్ల ఇప్పటికీ తెలుగు భాషకు చోటిస్తున్నారు. హార్డ్‌వేర్ దుకాణాలు, పూజా సామగ్రి షాపులు అధికంగా ఉన్న మింట్ స్ట్రీట్, గోవిందప్పనాయకన్ వీధి, మన్నడి, ప్యారీస్ కార్నర్‌లో, తెలుగువారు అధికంగా నివసిస్తున్న న్యూవాషర్‌మెన్ పేట, ఓల్డ్ వాషర్‌మెన్ పేట, తిరువొత్తియూరు, ఎన్నూరు ప్రాంతాల్లో దుకాణాల నేమ్‌బోర్డుల్లో తెలుగు అక్షరాలు మిరిమిట్లు గొల్పుతుంటాయి. ఇదే రీతిలో టి.నగర్‌లోని దుకాణాల నేమ్‌బోర్డుల్లోనూ తెలుగు అక్షరాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. తమిళనాట తెలుగు భాష చిరస్థాయిగా వెలుగొందుతోందని ఈ దుకాణాల నేమ్‌బోర్డులే బలమైన సాక్ష్యాలు. మద్రాసు నగరవాసులంతా తెలుగువారి పట్ల సోదరభావంతోనే మెలగుతారు. ఆ కారణంగానే తనను ఆదరించిన ఈ నగర వాసుల రుణం తీర్చుకునేలా ఆంధ్రుల 'అన్నగారు' ఎన్టీఆర్ 'తెలుగు గంగ'తో నగర వాసుల దాహార్తిని తీర్చి తమిళుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

సీఎం స్టాలిన్ మద్రాస్ డే శుభాకాంక్షలు

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ డే సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ మద్రాసు నగరం మారుమూల ప్రాంతాలకు చెందిన ఎందరినో మనకు స్నేహితులుగా అప్పగించిందని, బతుకు తెరువు కోసం వచ్చినవారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. ఎంతోమందికి తొలి జీవితాన్ని ఈ నగరమే ఇచ్చి, తమ సొంతూళ్లలో గుర్తింపునిచ్చిందని పేర్కొన్నారు. 'అందరికి సుఖమయ జీవితాన్ని ప్రసాదించిన చెన్నై నగరం వయస్సిప్పుడు 386 యేళ్ల అని, ఇదొక నగరం మాత్రమే కాదు తమిళులందరికీ ఊపిరి పోసే హృదయస్పందన..! మనకు మంచి జీవితాలను ప్రసాదిస్తున్న ఈ నగరానికి ఓ సెల్యూట్' అని స్టాలిన్ ఆ సందేశంలో తెలిపారు.

క్వీన్‌మేరీస్‌లో మద్రాస్ డే వేడుకలు

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్వీన్‌మేరీస్ మహిళా కళాశాలలో మద్రాస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా మద్రాసు నగర చరిత్రను తెలిపే ఫొటో ఎగ్జిబిషన్, నగరవాసులు ప్రాచీన కాలంలో ఉపయోగించిన వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని ఆ కళాశాల విద్యార్థినులే కాకుండా ఇతర కళాశాలల విద్యార్థులు, మద్రాసు డే నిర్వాహకులు తదితరులు తిలకించారు.





పాత మోడల్ కెమెరా, వందేళ్ల క్రితం నగరవాసులు ఉపయోగించిన వంట సామగ్రిని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న సంగీత కచేరి



గానం చేస్తున్న జ్ఞానప్రసూన, భార్గవ

వేళచ్చేరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని కర్పర వినాయక మందిరంలో గురువారం రాత్రి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి శ్రోతలకు వీనులవిందు చేసింది. జ్ఞానప్రసూన నరేశ్, వీఎస్‌కే భార్గవ మనోజ్ఞ జంటగా చేసిన సంగీత కచేరీలో పలు కీర్తనలు మధురంగా గానం చేశారు. ఇరుగళాలు ఏకంగా సమన్వయంతో పాడిన పాటలు శ్రోతలను ఎంతో రంజింపచేశాయి. రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయకుడి ఆలయంలో జరిగిన ఈ కచేరీలో 'కానడ రాగం'లో 'వరసిద్ధి వినాయక...', 'జయంతిశ్రీ రాగం'లో 'మరుగేలరా ఓ రాఘవా...' తదితర త్యాగరాజ కీర్తనలు ఆలపించినప్పుడు శ్రోతల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. చివరగా ఖండ ఏక తాళంలో వారు గానం చేసిన 'హిందోళ రాగం'లోని 'తిల్లానా...'కు అందరూ తాళం వేశారు. పలు వేదికలపై కచేరీలు చేసిన అనుభవంతో గాయనీమణులు మధుర మనోహరంగా గంటన్నర పాటు అలవోకగా సంగీత కచేరీ చేసి అందరినీ అలరించారు. ఆదిత్య మృదంగంపై, దివ్యరాఘవన్ వయొలిన్‌తో వాద్యసహకారమందించారు. తల్లీకూతుళ్లు కలిసి ఒకే వేదికపై జంటగా గానం చేయడం కొసమెరుపు.

చెన్నైస్ అమృత విద్యార్థినికి స్వర్ణపతకం



శ్రేయా అనీష్‌ను అభినందిస్తున్న భూమినాధన్ తదితరులు

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నైస్ అమృత యూనివర్శిటీ విద్యార్థిని శ్రేయా అనీష్ వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీస్ ఆమోదించిన 'హోటెలెక్స్ చైనా ఇంటర్నేషనల్ చైనీస్ వంటకాల ఛాంపియన్‌షిప్'లో స్వర్ణ పతకంతో పాటు రూ.2.50 లక్షల నగదును సాధించింది. చెన్నైలోని అమృత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చదువుతున్న శ్రేయ అనీష్ జూలై 24-26 మధ్య చైనాలోని చెంగ్డులో జరిగిన వంటల ఛాంపియన్‌షిప్ వ్యక్తిగత ఆహార కళా ప్రదర్శన విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఆమెను చెన్నైస్ అమృత గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ ఆర్.భూమినాధన్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రేయ అంకితభావం, కళాత్మకత, పాక నైపుణ్యం దేశం గర్వపడేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో కవిత నందకుమార్, డీన్ సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దర్శకులు హీరోలు కావడం ట్రెండ్‌గా మారింది

దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్



'కుట్రం పుదిదు' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

దర్శకులు హీరోలు కావడం ఓ ట్రెండ్‌గా మారిపోయిందని కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ దర్శకుడు ఆర్వీ.ఉదయకుమార్ అభిప్రాయపడ్డారు. జీకేఆర్ సినీ ఆర్ట్స్ పతాకంపై నిర్మించిన 'కుట్రం పుదిదు' చిత్రం ఆడియో రిలీజ్ తాజాగా నగరంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఉదయకుమార్ మాట్లాడుతూ, 'సాధారణంగా ఓ తండ్రి తన కుమారుడిని హీరోగా వెండితెరకు పరిచయం చేస్తే కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, ఇంట్రడక్షన్ సాంగ్ ఉండాలని కోరుకుంటారు. కానీ, నిర్మాత కార్తికేయన్ మాత్రం అందుకు భిన్నంగా తన కుమారుడిని విభిన్నమైన క్రైమ్ థ్రిల్లర్ మూవీ ద్వారా హీరోగా పరిచయం చేయడం అభినందనీయం. ఈ మధ్య కాలంలో దర్శకులు హీరోలుగా నటించడం ఇపుడు ట్రెండ్‌గా మారిపోయింది. ఒకటి రెండు హిట్ చిత్రాలు ఇచ్చే దర్శకులు హీరోలుగా నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు' అని అన్నారు. ఈ చిత్ర దర్శకుడు నోవా ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ, 'హీరో తరుణ్ విజయ్‌కు మంచి భవిష్యత్ ఉంది. గొరిల్లా తరహాలో శిక్షణ పొందాడు. హీరోయిన్ శేష్విత, నటి ప్రియదర్శిని, నిళల్‌గల్ రవి చాలా బాగా నటించారు. ఇది థ్రిల్లర్ మూవీ అయినప్పటికీ చాలా ఎమోషన్ దాగివుంది అని పేర్కొన్నారు. హీరో తరుణ్ విజయ్ మాట్లాడుతూ, 'నాకు ఇదే తొలి సినిమా. నా తల్లిదండ్రుల మద్దతు లేకుంటే హీరో అయ్యేవాడిని కాదు. నా తొలి చిత్రంలోనే దర్శకుడు నన్ను సరికొత్త కోణంలో చూపించారు. ఆయనకు ధన్యవాదాలన్నారు. కాగా, నోవా ఆర్మ్‌స్ట్రాంగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డాక్టర్ కార్తికేయన్ నిర్మించారు. ఈ నెల 29వ తేదీన విడుదలకానున్న ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా, తాజాగా ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

స్టార్ హీరోల చిత్రాల్లో కరాటే కార్తి



తన కెరీర్ ఆరంభంలో చిన్న చిన్న పాత్రలు చేసిన నటుడు కరాటే కార్తి ఇపుడు అగ్ర హీరోల చిత్రాల్లో నటించే స్థాయికి చేరుకున్నారు. శివకార్తికేయన్ నటించిన 'డాక్టర్' మూవీలో గోమతి అక్క అనే కామెడీ పాత్ర పోషించిన కరాటే కార్తి.. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో నటించారు. ఆరడుగుల పొడవు, చూడటానికి భయానకంగా కనిపించే ఈ నటుడు సొంతూరు మదురై. చిన్నప్పటి నుంచి సినిమా అంటే ప్రాణం. ఆరంభంలో సీఆర్పీఎఫ్‌లో ఉద్యోగంలో చేరిన కార్తి.. ఆ తర్వాత కరాటే, బాక్సింగ్ విభాగాల్లో అనేక పతకాలను గెలుచుకున్నారు. ఎస్ఐగా పదోన్నతి వస్తుందన్న సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసి సినిమాల్లోకి అడుగుపెట్టారు. కమల్ హాసన్ నటించిన 'దశావతారం'లో సహాయ నటుడిగా నటించి ప్రేక్షకుల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత తన ప్రతిభతో 'ఎన్నై అరిందాల్', 'ఖైదీ', 'ధీరన్ అధికారం ఒండ్రు', 'చిత్తిరై సెవ్వానం', 'బిగిల్', 'పేట', 'జైలర్' వంటి చిత్రాల్లో నటించి గుర్తింపుపొందారు. 'ధీరన్...', 'ఖైదీ' చిత్రాల్లో ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు 'డాక్టర్' చిత్రంలో అవకాశం వచ్చేందుకు ఓ కారణంగా నిలిచింది. ఈ నేపథ్యంలో తన సినీ కెరీర్‌పై ఆయన మాట్లాడుతూ, 'పేట' చిత్రంలో సూపర్‌స్టార్‌తో కలిసి చిన్న పాత్రలో నటించాను. ఆ తర్వాత నెల్సన్ దిలీప్ కుమార్ 'జైలర్' మూవీలో ఓ అవకాశం ఇచ్చారు. రజనీకాంత్‌కు వీరాభిమానిని. ఆయన చిత్రంలో ఒక్క సన్నివేశంలో అయినా నటించినా చాలని భావించాను. కానీ, ఏకంగా 'కూలీ'లో ఆయన పక్కనే నటించే అవకాశం, అదృష్టం వరించింది. ఇలాంటి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. భవిష్యత్‌లో కూడా ప్రేక్షకులు మెప్పించే పాత్రలను ఎంచుకుంటూ ముందుకుసాగుతాను. ఇపుడు సూర్య 'కరుప్పు' చిత్రంతో పాటు ఒక మలయాళ చిత్రంలో నటిస్తున్నాను' అని పేర్కొన్నారు.

అర్జున్ దాస్ ప్రేమలో ఐశ్వర్య లక్ష్మి?



కోలీవుడ్‌లోని విలక్షణ నటుడు అర్జున్ దాస్‌తో యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నట్టు కోడంబాక్కం వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. గతంలో ఇదే తరహా గుసగుసలు వినిపించగానే వాటిని అర్జున్ దాస్ ఖండించారు. ఐశ్వర్య లక్ష్మి కూడా తామిద్దరం మంచి స్నేహితులమంటూ వివరణ ఇచ్చారు. ఇపుడు మళ్ళీ ఈ తరహా ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి కారణం లేకపోలేదు. 'కాదలిల్ సొదుప్పదు ఎప్పడి' ఫేం బాలాజీ మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకునే ఒక వెబ్ సిరీస్‌లో వీరిద్దరూ కలిసి నటిస్తుండటమే దీనికి కారణం. నిప్పు లేకుండా పొగ రాదన్న సామెతను ప్రస్తావిస్తూ, వీరిద్దరూ ప్రేమలో ఉండటం వల్లే కలిసి వెబ్ సిరీస్‌లో నటించారంటూ పలువురు కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల్లోకి అడుగుపెట్టకముందు బ్యాంకు ఉద్యోగిగా, రేడియో జాకీగా అర్జున్ దాస్ పనిచేశారు. ఐశ్వర్య లక్ష్మి మాత్రం వైద్య విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత వీరిద్దరూ సినిమాల్లో అడుగుపెట్టి విజయవంతంగా తమ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి బాలవీరాంజనేయ స్వామి, సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఎస్పీఎఫ్ డీజీ అధికారి త్రివిక్రమ్ వర్మ, డిఫెన్స్ స్టాడింగ్ కమిటీ(ఎస్‌సీఓడీ) సభ్యులు, ఎంపీలు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సంజయ్ సింగ్, వీరేంద్ర సింగ్

బ్రహ్మోత్సవాలొస్తున్నాయ్

రిపేర్లు పూర్తి చేయండి

● తిరుమలలో వసతిపై ఈవో సమీక్ష

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న అన్ని వసతి గదుల్లో రిపేర్లను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అధికారులతో వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. లడ్డూప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. రాష్ట్ర ఆహార భద్రతాధికారులతో తిరుమలలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, హోటళ్లలో సంప్రదాయ భోజనం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.




సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,112

తలనీలాలు సమర్పించినవారు: 27,331



ఘల్లుమంది జానపదం



రవి కుల తిలకా రారా.. అంటూ శ్రీరాముడిని స్తుతిస్తూ సాగిన చెక్కభజన, హే బాహూ బంజారోళ్లం.. అంటూ గిరిజన సంస్కృతిని ప్రతిబింబించిన జానపదం, వస్త్రావా జానకి కోడిపందేమో నువ్వు.. అంటూ ప్రేమికుల మధ్య ప్రణయాన్ని తెలియజేసే జానపద నృత్యం. ఇలా.. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగిన జానపద కళారూపాల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడిఉన్న జానపద కళలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే తరానికీ అందించాలని ఎస్వీయూ వీసీ అప్పారావు సూచించారు. రాయలసీమ, చిత్తూరు ప్రాంతానికే ప్రత్యేకమైన కొన్ని జానపద కళలు ఉన్నాయని, ఇలాంటి విలువైన కళలను కాపాడుకోవాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. జానపద విజ్ఞానంలో జానపద సంగీతం, జానపద నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని పద్మావతి వర్సిటీ సంగీత-నృత్య విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. చెక్క భజన, కోలాటం పాటల్లో మన సంస్కృతి ఉందని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ చెప్పారు. విద్యార్థుల్లో జానపదం పట్ల మక్కువ కలిగించడానికి.. వారిలో జానపద విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి చెప్పారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి













కొండను ఢీకొన్న టెంపో - ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు

స్వల్పగాయాలతో బయటపడిన భక్తులు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. భక్తులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నారావారిపల్లెకు చెందిన కొందరు దర్శనం తర్వాత శుక్రవారం కారులో తిరుపతికి వస్తుండగా 26వ మలుపువద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌రోడ్డులోని చివరిమలుపు వద్ద ఓ టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. విజయవాడకు చెందిన 10 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.

భక్తితో భద్రతా బాధ్యతలు

● సిబ్బందితో ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ్ వర్మ



తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): భద్రతా వైఫల్యాలకు తావులేకుండా తిరుమలలో విధులు నిర్వహించాలని ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో భద్రతా జాగ్రత్తలపై తిరుపతిలోని శ్వేతభవనంలో శుక్రవారం ఎస్పీఎఫ్ సిబ్బందితో డీజీ సమావేశమయ్యారు.. టీటీడీలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతం. భక్తి, అంకిత భావంతో, విచక్షణతో, క్రమశిక్షణతో భక్తులను మెప్పించే విధంగా భద్రతా సిబ్బంది సేవలందించాలన్నారు. హెడ్ కానిస్టేబుళ్లగా ప్రమోట్ అయిన 1998 బ్యాచ్ కానిస్టేబుళ్లను అభినందించారు.

నేడు హథీరాంజీ మఠం భవనం పరిశీలన

తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం ప్రధాన కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, మఠం ఇంచార్జి ఈవో బాపిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించనున్నారు. ఈ బృందంతో పాటు తిరుపతి ఐఐటీ నుంచీ సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు రానున్నారు. గత మంగళవారం కలెక్టరేట్‌లో మఠం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, షాపుల నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అందరితో కలసి ప్రత్యక్షంగా మఠం భవనాన్ని పరిశీలించాలని, భవనం పటిష్ఠతను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని నాడు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికనుగుణంగా శనివారం ఉదయం 11 గంటలకు మఠం భవనం వద్దకు రానున్నారు. కాగా, శిథిలావస్థకు చేరిన ఈ పురాతన భవనాన్ని తిరుపతి ఐఐటీ నిపుణులు సైతం పరిశీలించి నివాస యోగ్యం కాదని, కూల్చివేతకు సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. దీంతో కూల్చివేతకు దేవదాయశాఖ టెండర్లు కూడా పిలిచింది. ఆ దశలో ఈ వివాదం రాజకీయ మలుపు తీసుకోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆచితూచి అడుగులేస్తున్నారు. భవనం కూల్చివేస్తే తిరిగి కొత్త భవనాన్ని నిర్మించే విషయమై దేవదాయ శాఖ నుంచీ స్పష్టత తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు భవనాన్ని కూల్చకుండా వారసత్వ కట్టడంగా కొనసాగించేందుకు అందుబాటులో వున్న అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. ఆ మేరకు పురావస్తు శాఖ, తిరుపతి ఐఐటీ, సెంట్రల్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర సంస్థలకు కూడా లేఖలు రాశారు. మొత్తానికీ శనివారం ఈ భవనాన్ని పరిశీలించాక ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై నగరవాసుల్లో ఆసక్తి నెలకొంటోంది.

నీట్ పీజీలో మెరిసిన తిరుపతి కుర్రోడు సాయినితేష్

● ఆలిండియాస్థాయిలో 136వ ర్యాంకు కైవసం



తిరుపతిరూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుచానూరు వీవీ లేఅవుట్‌కి చెందిన డాక్టర్ గండికోట సాయినితేష్ అత్యుత్తమ ప్రతిభ చాటి ఆలిండియా136వ ర్యాంకుని కైవసం చేసుకున్నాడు. ఈనెల 3న నిర్వహించిన ప్రవేశపరీక్షా ఫలితాలను ఇదే నెల 19న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో సాయినితేష్ 136వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ విద్యార్థి తిరుపతిలోని ఎస్వీమెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని టాప్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో జనరల్ మెడిసిన్‌ని అధ్యయనం చేస్తానని అంటున్నాడు. కాగా ఈయన స్నేహలత, శ్రీధర్ (విద్యుత్‌శాఖలో డీఈఈ) దంపతుల కుమారుడు. చెల్లెలు జాహ్నవి పద్మావతి మెడికల్ కళాశాల (స్విమ్స్)లో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు.

వందశాతం.. అడ్మిషన్లు, ఉత్తీర్ణత

ఇదే లక్ష్యంతో పనిచేయాలంటూ సంక్షేమ హాస్టళ్ల అధికారులకు మంత్రి డోలా సూచన

తిరుపతి(జీవకోన), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో వందశాతం ప్రవేశాలు.. ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రీజనల్ కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. 'వసతి గృహాల మరమ్మతులకు రూ.143కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ.100కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50కోట్లు విడుదల చేశాం. వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వసతి గృహ విద్యార్థులకు నవోదయ, గురుకుల పాఠశాలల్లో.. ఎంసెట్ ప్రవేశ పరీక్షలను రాసేలా అధికారులు సన్నద్ధం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తిరుపతి కలెక్టర్ ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వారిచే తమ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోవడం శుభపరిణామన్నారు. సంక్షేమ శాఖలోని డీడీలు, డీఎస్‌డబ్ల్యూవో, ఎస్‌డబ్ల్యూవో, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనితీరు మార్చుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తూ, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా రాత్రి బస చేయాలని సూచించారు. వసతిగృహాల నిర్వహణ, విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై అవగాహన కల్పించడం కోసమే ఈ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి తెలిపారు. తిరుపతి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ తరఫున శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి మానసికంగా, శారీరకంగా బలోపేతం చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మొదటి దశలో 11వేల మంది విద్యార్థులు, 250మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న మంత్రి, కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

జర్మనీలో నర్సింగ్ అవకాశాలు

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని బాబు జగజీవన్‌భవననందు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణను ఆయినన ప్రారంభించారు. జర్మన్‌భాషపై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని సూచించారు. జర్మన్‌భాషపై పట్టు సాధించడానికి ఉచితంగాశిక్షణ ఇచ్చి అర్హత సాధించేలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్, నైపుణ్యాభివృద్ధి శాఖ ఈడీ మధుసూదన్, డైరెక్టర్ లావణ్య వేణి, విక్రమ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




ముక్కంటి ఆలయంలో మాక్‌డ్రిల్

శ్రీకాళహస్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి ప్రభుత్వం తరఫున ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. డీఎస్పీలు విశ్వనాథ్, మధుసూదన రావు, ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్, వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శత్రుమూకలను ఎలా ఎదుర్కోవాలి,ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేట్టూరు డ్యాంకు 92 ఏళ్లు

● డెల్టాలో సంబరాలు



ప్యారీస్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం నిర్మించి 91 ఏళ్లు పూర్తయింది. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే కావేరి నది రాష్ట్రంలోని డెల్టా జిల్లాల మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. కర్ణాటకలో తక్కువ ప్రాంతాల్లో ప్రవహిస్తున్న కావేరి రాష్ట్రం మీదుగా సుమారు 700 కి.మీ దూరం ప్రవహించి పుంపుహార్ వద్ద సముద్రంలో కలుస్తుంది. రుతుపవనాల సీజన్‌లో నీటిని నిల్వ చేసే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యపై దృష్టి సారించిన అప్పటి ఆంగ్లేయ పాలకులు నీటి నిల్వ కోసం 1925లో మేట్టూరు ప్రాంతంలో డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్లానింగ్ ఆఫీసర్ అప్పటి చీఫ్ ఇంజనీర్ కర్నల్ ఎల్లీస్ నేతృత్వంలో వేలాది మంది కార్మికులు డ్యాం నిర్మాణపనుల్లో పాల్గొన్నారు. దాదాపు తొమ్మిదేళ్లకు 1934 జూలై 14వ తేదికి నిర్మాణం పూర్తయింది. దీనికోసం అప్పట్లో రూ.4.80 కోట్లతో అద్భుతంగా డిజైన్ చేసిన మేట్టూరు డ్యాంను 1934 ఆగస్టు 21న అప్పటి మద్రాసు ప్రెసీడియం కర్నల్ జార్జి ఫెడరిక్ స్టాన్లీ జాతికి అంకితం చేశారు. ఈ డ్యాం నీటితో సేలం, కరూర్, తిరుచ్చి, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం సహా 12 జిల్లాల్లో సుమారు 17 లక్షల ఎకరాలకు సాగునీరందుతోంది. 5,300 అడుగుల పొడవైన ఈ డ్యాంలో 59.25 చ.మై విస్తీర్ణంలో నీటిని నిల్వ ఉంచొచ్చు. కాగా, డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు. 93.5 టీఎంసీల నీటిని డ్యాంలో నిల్వ చేసి డెల్టా జిల్లాలకు తాగునీరు, సాగు నీటికోసం 16 గేట్లు ఎత్తి విడుదల చేస్తుంటారు. ముఖ్యంగా, జూన్ 12న డెల్టా జిల్లాల రైతుల కోరిక మేరకు సాగు నీటిని విడుదల చేస్తుంటారు. ఆ రీతిలో ఇప్పటివరకు 20 సార్లు జూన్ 12న, ఆ తేదీకి ముందే 11 సార్లు, వర్షాలు కురవని కారణంగా ఆలస్యంగా 61 సార్లు నీటిని విడుదల చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో, మేట్టూరు డ్యాం 92వ వసంతలోకి అడుగుపెట్టిన సందర్భంగా డెల్టా జిల్లాల ప్రజలు, రైతులు పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

సీఎం స్టాలిన్‌తో కేరళ మంత్రి భేటీ



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తిరువిదాంకూర్ దేవసమ్ బోర్డు వజ్రోత్సవాలకు ఆహ్వానిస్తున్న కేరళ సహకార, రేవుల శాఖ మంత్రి వీఎన్ వాసవన్.